
# మనది కాని మనీ

**అర్నాద్**



ఆ గదిలో ముగ్గురు ఆడవాళ్లు.

అక్కడ విచిత్రమైన ఒత్తిడి. ఆశల స్వర్గాలు, భయాల నరకాలు వాళ్లని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అంచేత గది తలుపులు బిగుసుకున్నాయి. కిటికీ రెక్కలు మూసుకున్నాయి.

తల్లీ పిల్లలు. తల్లి అంటే తల్లేగాని పిల్లలంటే చిన్నపిల్లలు కారు. పాతికేళ్లు దాటిన ఆడవాళ్లు. పెళ్లిళ్లు చేసుకుని ముచ్చటగా కాపురాలు చేసుకుంటున్నవాళ్లు. అంతేకాదు. వాళ్లకి పిల్లలు కూడా వున్నారు. ప్రస్తుతం పిల్లలు ఆ గదిలో లేరు. గది బయట ఎదురుగా ఉన్న పార్కులో ఆడుకుంటున్నారు. కాదు, ఆడుకొమ్మని బయటకు పంపించేశారు తల్లులు. అవును ఆ సమయంలో కూడదు పసిపిల్లల అంతరాయం.

ఆ తల్లుల తల్లి సుందరమ్మ మధ్య తరగతి ఇల్లాలు. ఆమెకు సంతానం ఆ యిద్దరు అమ్మాయిలు మాత్రమే! విజయపెద్దది. నీరజ చిన్నది. ఒక ఏడాది మాత్రమే చిన్నది.

కూతుళ్లతో తిరుపతి వస్తానని మొక్కుకుంది సుందరమ్మ.

''మీ అమ్మ అల్లుళ్లతో వస్తానని మొక్కుకోలేదు. అంచేత మేం రాం'' అని సుందరమ్మ అల్లుళ్లు సరదాగా అలిగేరు.

అది కూతుళ్లు సీరియస్‌గా తీసుకున్నారు.

''మీరు లేకుండా తిరుపతి వెళ్లలేమనుకుంటున్నారా! చూడండి. మా తడాఖా. వెళ్లి చూపిస్తాం'' అన్నారు. మేటర్ సీరియస్ అయింది.

పంతాలు పెరిగేయి. మొగుళ్ల సహకారం ఏ మాత్రం తీసుకోకుండా ఆడకూతుళ్లు రాను పోను రైలు రిజర్వేషన్లు స్వయాన చేసుకోగలిగేరు. అలాగే అడ్వాన్సుగా కాటేజి బుక్ చేసుకోగలిగేరు.

మొగుళ్లు చేసింది ఏమిటంటే ఫ్లాటుఫారం మీదకొచ్చి, రైలు కదిలేవరకూ వుండి, రైలు కదిలిపోతుంటే చేతులు ఊపడమే. అంతకన్నా చేసిందేమీ లేదు.

సురక్షిత ప్రయాణం, గుడికి అందుబాటులో చక్కని

కాటేజి. రెండున్నర గంటల్లో ఏడుకొండలవాడి దర్శనం. తర్వాత హుండీలో మొక్కుబడులు, ప్రసాదాలు అంతా సవ్యంగా సాగింది.

సరదాగా, హాయిగా కబుర్లు దొర్లించుకుంటూ, మూడు పట్టుచీరలనీ ఇద్దరు చంటిపిల్లలనీ ఈడ్చుకుంటూ జాగర్తగా శరీరాలను ఉదయం పదకొండు గంటలకు కాటేజీకి చేరవేసి విశ్రాంతి తీసుకోబోయారు తల్లీకూతుళ్లు.

అంతలోనే అమాంతంగా ముగ్గురు ఆడవాళ్ల మతులు పోయేయి. ప్రతిమల్లా నిలుచుండి పోయేరు. నోటమాటరాక నిశ్చేష్టులైపోయారు.

గదిలో దొంగలు పడలేదు. పట్టుచీరలెవరూ పట్టుకుపోలేదు. మెడలో నగలు ఎవరూ కాజేయలేదు. చిత్రంగా గదిలోకి చిన్నపిల్లలు ఇద్దరితో బాటు ఒక మూట నడుచుకువచ్చింది.

ఇద్దరు పిల్లలూ తమతోబాటు వస్తున్నా, పిల్లల చేతిలో మూటను చూడలేకపోయారు తల్లులు.

ఆ మూటను గదిలో మాత్రమే గుర్తించారు.

మూటవిప్పి చూడగానే మరింత షాక్‌తినేశారు.

మూటలో బాంబులేదు.

పసుపు వస్త్రంలో దండిగా రూపాయల నోట్లు.

లెక్క పెడితే ఖచ్చితంగా పాతికవేలు!

తల్లీ కూతుళ్లకు ముచ్చెమటలు పోసేయి. కాళ్లూ, చేతులు గజగజ వణికేయి.

పిల్లలని గట్టిగా అడిగితే ఎక్కడ దొరికిందీ చెప్పలేకపోయారు. నెమ్మదిగా అడిగితే తలా ఒకరు తలో చోట చెప్పేరు. పిల్లలను, మూటను తీసుకుని వెనక్కివెళ్లారు. పిల్లలు మూట దొరికిన చోటు చూపలేకపోయారు.

అంతా చిత్రం. మరెంతో అయోమయం. ఏం చేయాలో తెలీని స్థితి. తమతో మగవాళ్లు లేని లోటు వాళ్లకప్పుడు తెలిసొచ్చింది. కాని ఆ మాట ఎవరూ బయటకు అనే సాహసం చేయలేదు.

గదిలో కాసేపటికి–

కాస్త శాంతించేరు. చీర మార్చుకునేటంతలో భీతి, భయం చెదిరిపోయేయి. కంగారు, కలవరపాటు కాసేపటిలో అయిసుముద్దలా కరిగిపోయేయి.

స్థిమితంగా కూర్చోగల స్థితిలో ఉన్నారు.

వాళ్ల ఎదురుగా బల్లపైనున్న డబ్బుమూట భయాందోళనల నుంచి.... సంభ్రమాశ్చర్యాల్లోంచి... ఆనందడోలికల్లోకి ఆశలు రేపుతూ వాళ్లని నిలవనీయని స్థితికి తీసుకువచ్చింది.

తాము ఎవరు? ఎందుకొచ్చేరు? ఎక్కడున్నారు? ఏం చేస్తున్నారు?– అలాంటి ప్రశ్నలు విజయ, నీరజలు వేసుకోవడం లేదు.

ఎదురుగా మూట ప్రశ్నగా మారింది.

ఆ మూటలో రూపాయి నోట్లు. ఆ నోట్లపై వాళ్ల ఆలోచనా దొంతరులు.

చిన్ని కృష్ణుడి చిన్ని నోటిలో యశోదమ్మకు విశాల ప్రపంచం కనిపించినట్టు ఆ పాతికవేల రూపాయల చిన్న మూటలో వాళ్లకి తమ ప్రపంచం సమస్తం కనిపిస్తోంది.

అయితే తల్లి సుందరమ్మ ఆలోచనలు వేరుగా ఉన్నాయి. కూతుళ్ల విజయ, నీరజల ఆలోచనలు మరోలా మరోలా ఉన్నాయి. ఎవరిలోకంలో వారు ఉన్నారు.

చివరికి నిశ్శబ్దానికి తెరవేసింది తల్లి.

''ఏం చేద్దాం ఈ డబ్బుని'' ప్రశ్నించింది కూతుళ్లిద్దరినీ.

''ఇది డబ్బు కాదు. దైవ ప్రసాదం'' మూటని కళ్లకద్దుకుంది చిన్నకూతురు నీరజ.

సుందరమ్మ విస్మయంగా చూసింది.

''సరే...! ప్రసాదాన్ని ఏం చేద్దాం'' అని అడిగింది సుందరమ్మ.

''నాక్కావాలి.' అపురూపంగా ప్రసాదం మూటను మా ఇంటికి తీసుకుపోతాను. మా అమ్మ మంచిది కాదనదు'' అని తల్లిని ముద్దులాడింది నీరజ.

ఇదంతా చూస్తున్న పెద్దకూతురు విజయకి ఒళ్లు మండిపోయి ''మరి నేను!'' అంటూ తన ఉనికిని గుర్తుచేసింది. హక్కుని తెలియజేసింది.

''మా బంగారు అక్క కూడా ఎంతో మంచిది. నేను ప్రసాదం తీసుకుంటానంటే ఏమీ అనుకోదు. కాదనదు'' అంది నీరజ అక్కని ప్రసన్నం చేసుకునే ప్రయత్నంలో.

''అబ్బా! ఆశ! అదేం కుదరదు. నేనేం పాపం చేశాను. ప్రసాదం అన్నాక అందరూ తినాలి. అందరికీ చెందాలి'' అని తెలియజేసింది విజయ.

''అదేం కాదు! నా బుజ్జి అనురూప్ కష్టపడి మూటను మోసుకొచ్చేడు. నేను వాడి తల్లిని గనుక ఆ సొమ్ము నాకు మాత్రమే చెందుతుంది''– లా పాయింటు తీసి అటాక్ ఇచ్చింది నీరజ.

''చెల్లీ! నీ స్పీడు తగ్గించు. నా బుజ్జిముండ బోనీ ముందుగా మూటను చూసింది. చూసి తీయమంది. అది చూడకపోతే, చూసి చెప్పకపోతే ఈ మూట ఇక్కడ ఉండేది కాదు. అది తెల్సుకో''

''అలా అని బోనీ నీతో చెప్పిందా''

''అవును చెల్లెమ్మా చెప్పింది. నా చెవిలో నెమ్మదిగా ఊదింది''

''సరే! మాకూ చెవులున్నాయి. మరి బోని మాకెందుకు ఊదలేదో'' అంది వెటకారంగా నీరజ.

''బాగుంది. తన చుట్టూ ఎన్నెన్ని చెవులున్నా పిల్లలకి తల్లిచెవులే చేటంత కనిపిస్తాయి. అర్జునుడి బాణానికి చెట్టు కాకుండా, పిట్టకాకుండా చెట్టు మీద వున్న పిట్టకన్నే కనిపించినట్టు'' అంది విజయ.

''తల్లీ చెవులు మాకు లేవు. సరే ఒప్పుకుంటాను. కాని చత్వారం లేని చక్కటి కళ్లు వున్నాయి కదా మాకు! మరి మా కళ్లు మాత్రం నీ చెవిలో బోని గుసగుసలాడడం చూడలేదనే చెబుతున్నాయి.''

''ఒసే చెల్లీ! దానికి నేనేం చేయను. ఆ సమయంలో నీ కళ్లు మిలమిల మెరిసే ఏ ఖరీదైన పట్టుచీరకో గబ్బిలంలా వేలాడిపోయి ఉంటాయి. ప్రపంచంలో పొరుగు చీరలు సమస్తం అసూయతో నీ కళ్లు కుట్టేస్తాయి కదా. పాడు కళ్లు!'' అంది కాస్త గట్టిగా విజయ.

అంతకన్నా గట్టిగా సుందరమ్మ కోప్పడింది.

మీ కళ్లూ, చెవులూ కాసేపు ఆ గోడకున్న హేంగర్‌కి తగిలించేసి ఎదురుగా ఉన్న డబ్బుని ఏం చేయలో వెంటనే తేల్చేసి చెప్పమంది సుందరమ్మ.

''చెబుతున్నాను. ఆ పాతికవేలు మొత్తం నాకే కావాలి. అంతే'' అంది విజయ.

''ఎందుకు?'' అనడిగింది సుందరమ్మ.

''నాకు కావాలని చెప్పాను కదా''

''అదే ఎందుకూ అని అడుగుతున్నాను''

''ఎందుకో చెప్పాలా'' గొంతు పెంచింది విజయ.

''చెప్పి తీరాలి'' అంది అదే స్థాయిలో నీరజ.

ఒక క్షణం ఆగి, ఆ వెంటనే విజయ తల్లి మెడ చుట్టూ చేతులు వేసి మురిపెంగా అన్నది. ''అమ్మా! నీకు గుర్తుందా. మా పక్కింటి విజయలక్ష్మి నీకు తెల్సుకదా! ఆ మధ్య కొడుకు దగ్గరికి అమెరికా వెళ్లి నా కోసం మర్చిపోకుండా పగడాలు కొని తీసుకొచ్చింది గదా. అవునా? పగడాల అప్పుకూడా ఇంకా తీర్చలేదు. నా మోహం గొలుసు ఏం చేయించుకుంటాను అని దిగాలు పడిపోతే అమ్మా! నీవే మాటన్నావో గుర్తుందా!''

వాళ్ల ఎదురుగా బల్లపైనున్న డబ్బుమూట భయాందోళనల నుంచి.... సంభ్రమాశ్చర్యాల్లోంచి... ఆనందడోలికల్లోకి ఆశలు రేపుతూ వాళ్లని నిలవనీయని స్థితికి తీసుకువచ్చింది.

సుందరమ్మ గుర్తు చేసుకునే ప్రయత్నం చేస్తున్నట్టు కనిపించలేదు.

విజయ అదేమీ గమనించకుండా తల్లి ఏమన్నదో తనే చెప్పసాగింది–

''ఆరోజు నేనేమన్నావో తెల్సా! 'అమ్మా విజయా, రోజులెప్పుడూ ఒకేలా వుండవు. నీకు తెలీకుండానే ఒక్కసారిగా మంచిరోజులు వచ్చేస్తాయి. పగడాల అప్పు తీర్చేసి నీవు నీకు నచ్చిన రీతిలో గొలుసు చేయించుకునే బంగారపు రోజు తప్పక వస్తుంది' అన్నావు. అవును కదా! నీ దీవెన, నీ నోటి చలవ వల్ల ఈ రోజు ఏడు కొండలవాడు, వెంకటరమణమూర్తి ఈ దివ్య ప్రసాదాన్ని అందించేడు. నీ మనోవాంఛ సిద్ధిస్తూ అని ఈ డబ్బుని ప్రసాదించేడు. దేవుని దయకు ఇంతకన్నా నిదర్శనం లేదు.''

చప్పట్లు కొట్టింది నీరజ.

''చాలా గొప్ప మహిమ చెప్పావు అక్కా! నా

ఒడలు జలదరిస్తోంది. అక్కా! మనం ఇక్కడితో వూరుకోవద్దు. 'దేవుని దయ-నిదర్శనం' అని రేపు మీడియాకి తెలియజేద్దాం. పేపర్లో బాక్స్ అయిటమ్ కింద అచ్చు దిగిపోతుంది. ఆలిండియా రేడియోలోనే, టీవీ వివిధ ఛానల్స్‌లోనూ ఒక సెన్సేషనల్ న్యూస్‌గా దిగ్భ్రమపరచి చెవిలో పూవులు పెడుతుంది. భక్త జనం చెవిలో పూలు ప్రత్యక్షమైన అనేక దృష్టాంతాలు దృశ్యాలు మళ్లీ మీడియాలో మార్మోగిపోతాయి. దాంతో తిరుపతి దేవస్థానంవారు నిన్నొక 'విఐపి'గా పరిగణించి నీకు సకల సదుపాయాలు కలుగజేస్తారు. సినీతార వెనకాల బొచ్చు కుక్కల మాదిరి నీ వెనుక మేం ఉండి అప్పుడప్పుడు తిరుమలేశుని తీరుబడిగా చూసే అవకాశం మాకు కల్పించిన దానివవుతావు. మరోవైపు నీ దివ్య స్వరూపాన్ని అమెరికా పగడాల గొలుసుతో సహా చూసి తరించిపోవడానికి జనం విరగబడి తరలివస్తారు. అక్కా! అక్కా! ఒకసారి నీ పగడాల గొలుసు నాకిస్తావు కదే! అయ్యో పూర్తిగా కాదులేవే! అలా చూసి ఇలా ఇచ్చేస్తాను... ఇస్తావు కదా'' అని ఒక పూనకం ఆవహించినట్టు గడగడమని విజయపై పడిపోయింది నీరజ.

''చూసావు కదవమ్మా! బళుక్కుమని దీని కడుపులో కుళ్లంతా కక్కేసింది నామీద! అక్క గొలుసు కొనుకుంటానంటే సంతోషించాల్సింది పోయి ఇలా నాపై పడి ఏడ్వడం బాగోలేదు. చెల్లి అంటే ఎలా ఉండాలో తెలుగు సినిమాలు చూడు. మొన్న టీవీలో పాత సినిమా పెళ్లి కానుక చూళ్లేదా! ప్రాణం కన్నా మిన్నగా ప్రేమించిన నాగేశ్వర్రావుని బీస్సరోజ త్యాగం చేసి అక్క కృష్ణకుమారికిచ్చి ఘనంగా పెళ్లి చేయిస్తుంది. చెల్లెలివి నీవూ వున్నావు ఎందుకూ'' అని దెప్పి పొడిచింది విజయ.

''క్షమించు అక్కా! నా మొగుణ్ణి నీవు కోరుకుంటున్నావనే కొత్త విషయం నాకిప్పుడే తెల్సిందే. ముందుగా చెప్పాల్సింది అక్కా!''

''తంతాను!... చూడమ్మా దీని పాడు మాటలు''

''అవునక్కా! బీస్సరోజాదేవి చేసే త్యాగాల వంటివి నీకు ఎన్ని కావాలంటే అన్ని చేసేయగలను. అక్క కోసం ఏమైనా చేస్తాను. కానీ నీవు దయచేసి ఈ పాతికవేల సంగతి మర్చిపో. అసలు నీవు మాతోబాటు తిరుపతి రాలేదనకో. వచ్చినా ఈ డబ్బు చూడలేదనుకో... అక్కా! నాకు ఈ పాతికవేలు అత్యంత అవసరం పడ్డాయి. నాకు ఖచ్చితంగా కావాలి. గుడిలో ఉదయం ఏడుకొండలవాడిని కనులారా, మనసారా తృప్తిగా చేతులెత్తి దండం పెట్టుకోనీయకుండా ఆడ వాలింటీర్ నన్ను చేయిపట్టుకు లాగేస్తున్నా సరే ఆ అరసెకనులో నా మనసు విప్పి నా అవసరాన్ని విన్నవించేను. భగవంతుడు విన్నాడు. ఈ మూట పంపేడు. అక్కా నీ మనసు బంగారం, నాకు తెల్సు. నన్ను అర్థం చేసుకుని ఆదరించే అక్కని ఆ భగవంతుడు నాకు ప్రసాదించేడు. నేను అడిగింది కాదనదు. తీసుకుంటే వద్దనదు. మా మంచి అక్క.''

''నేనెంత మంచి అక్కనో చాలా చక్కగా చెప్పావే చెల్లీ! నీవన్నట్టు నా మనసే బంగారం కాదు. నా శరీరం కూడా ధగధగ మెరిసిపోయే బంగారపు ఛాయే! అంచేత నా బంగారు వంటికి ఎర్రపగడాల బంగారు గొలుసు బహుచక్కగా మాచ్ అవుతుంది. ఈ డబ్బుతో గొలుసు చేయించుకుని, నీవు నా ప్రియమైన చెల్లివి గనుక నీకు అప్పుడప్పుడు ఇస్తానులే... వేసుకొని ఇచ్చేద్దువు గాని, సరేనా!''

''చాలా థాంక్స్ అక్కా! కాని నాదొక మాట. బంగారం ఎప్పుడయినా కొనొచ్చు. గొలుసు మరెప్పుడయినా చేయించుకోవచ్చు. ఈ తిరుపతి కొండ మీద ప్రమాణం చేసి అతి సీరియస్‌గా చెబుతున్నాను. నాకు ఈ పాతిక వేలు అత్యంత అవసరం. ఆ డబ్బు నా నగలకీ, నా చీరలకీ నా షోకులకు మాత్రం కాదు.''

''మరెవరికోసం? ఎందుకోసం?''

''నా బంగారు బాబు అనిరుథ్ కోసం'' అంది సీరియస్‌గా నీరజ.

''అదేమిటే! ఏమైంది? అనురుథ్ బాబుకి ఏమయ్యింది?'' గాబరాగా అడిగింది తల్లి సుందరమ్మ.

''అంత డబ్బు అవసరం ఎందుకో దేవుడికి తప్ప... తల్లికీ, అక్కకీ చెప్పగూడదా! ఇంతకీ ఏమయిందో చెప్పవే చెల్లీ!... ఈ మధ్య టీవీ నైన్‌లో తెగచూపిస్తున్నారు. గుండెజబ్బు పిల్లల దీనగాథల్ని... అనురుథ్‌కి ఆపరేషన్ లాంటిది ఏదైనా...''

''అక్కా! కాస్త నోరు మూస్తావా? గుండె ఆగిపోయేలా ఏమిటా ముదనష్టపు మాటలు! ఫైవ్‌స్టార్ కార్పొరేట్ ఆసుపత్రులూ... ఆపరేషన్లూ... అమ్మో! అమ్మో! మనకే కాదు తల్లోయ్ శత్రువులకీ వద్దు. నీకు తెలుసో లేదో! అక్కడ ఈ పాతికవేలు ఏపాటి? ఆస్పత్రి అరుగు ఎక్కగానే అక్కడే ఎగిరిపోతాయి. అక్కడ అడుగుపెట్టిన మనిషికి ప్రాణంపోస్తారో లేదో గాని లక్షలు లక్షలు మాత్రం బలవంతంగా లాగి గుంజి నమిలి మింగేస్తారు. అక్కా! నీకిదే చెప్పడం. మాటవరసకైనా అలాంటి పాడుమాటలు అనొద్దు కొన్ని నోర్లు మంచివి కావు.''

''ఇప్పుడే కదే! నన్ను మా మంచి అక్క అన్నావు.''

''బుద్ధి తక్కువై అన్నాను'' అని లెంపలు వేసుకుంది నీరజ.

''అనిరుథ్ బాబుకి నాలుగైదేళ్లు కూడా నిండలేదు. వాడికెందుకే పాతికవేలు'' వదల్లేదు సుందరమ్మ.

''అంటే ఏమిటి మీ ఉద్దేశం? రోగాలకి తప్పించి మరే అవసరం పిల్లలకి ఉండదనుకుంటున్నారా?''

''నాకేం తెలుసు తల్లీ! పాతకాలపుదాన్ని. మీ పెళ్లిళ్లకి లక్షలూ, వేలూ పోసాను తప్ప మీ ఆలనా పాలనాకి వేలకి వేలు ఖర్చుపెట్టలేదు. ఇప్పుడు మీరు మీ పిల్లలకి పెట్టే కొత్త ఖర్చులు చెప్పకపోతే నాలాంటిదానికి ఎలా తెలుస్తుంది'' అన్నది సుందరమ్మ.

''అది ఉదయం డైరెక్టుగా ఏడుకొండల వాడికే చెప్పిందంట. నీవు దాన్ని అడిగేకన్నా ఆయన్నే అడుగు. బెటర్!'' అంది విజయ.

''ఇది వేళాకోళం కాదక్కా! సీరియస్ వ్యవ



## ఉప్పు ముప్పు!

**కూ**రలో తగినంత ఉప్పు వేయందే దానికి రుచి రాదు. 'అన్నేసి చూడు నన్నేసి చూడు' అంటూ ఉప్పు గొప్పతనాన్ని చెబుతుంటారు. ఉప్పు సోడియం, క్లోరిన్ అనే రెండు రసాయన మూలకాల సంయోగం వల్ల పుట్టింది కనుక దీనిని సోడియం క్లోరైడ్ అని కూడా పిలుస్తారు. ఆహారపదార్థాలు ఉప్పుతో కలిపి నిల్వచేస్తే చాలాకాలం నిల్వ ఉంటాయని తెల్సిందే కదా!

సాధారణంగా మన శరీరానికి రోజుకు 200 మిల్లీగ్రాముల ఉప్పు తింటే సరిపోతుంది. అంటే చెంచాలో పదో వంతు చాలు. ఈ ఉప్పు కూడా నీళ్లు, కాయగూరలు మొదలైన ఆహార పదార్థాల వల్ల మన దేహానికి అందుతుంది. కానీ మన జిహ్వ చాపల్యం చంపుకోలేక వంటలలో ఉప్పు ఎంతగానో వేసుకుంటాం. కారణం మనం చిన్నప్పట్నుంచి ఉప్పు రుచికి అలవాటు పడివుండడమే. ఆరోగ్యంగా ఉన్నంత కాలం మూత్రపిండాలు ఎంత ఉప్పునైనా ఫిల్టర్ చేసి బయటకు పంపగలవు. కాకపోతే మూత్రపిండాలకు ఏదైనా అనారోగ్యం వచ్చిందా! ఇక అప్పుడు ముప్పు తప్పదు. మనం పెద్దవుతున్న కొద్దీ గుండెకీ, మూత్రపిండాలకీ రోగాలు, రక్తపోటు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి గనక సాధ్యమైనంత వరకు ఉప్పును తీసుకోవడం తగ్గించడమే బెటర్.

హారం. బాబు భవిష్యత్‌కి సంబంధించిన విషయం.''

''ఇప్పుడు సడన్‌గా అనిరుథ్ భవిష్యత్‌కి అడ్డం ఏమిటొచ్చిందే తల్లీ'' అని అడిగింది సుందరమ్మ కంగారుగా, భయంగా.

''అనిరుథ్‌కిపుడు నాలుగో ఏడు. వాడిని కాన్వెంట్‌లో జాయిన్ చేసే సమయం ఆసన్నమయింది'' అంది నీరజ సీరియస్‌గా.

''చదువుకోసమా! సరిపోయింది. ఏదో సామెత చెప్పినట్టు...''

''అక్కా! సామెతలు వద్దు. నేను చెబుతున్నది సీరియస్ మేటర్''

''నేనూ సీరియస్‌గానే చెబుతున్నాను. నీ కొడుక్కి నూనుగు మీసాలు వచ్చే వయసుకి... ఇంజనీరింగ్ పేమెంట్ సీటుకోసం పాతికవేలు ఇప్పటినుంచే బ్యాంక్‌లో దాస్తావా? గొప్ప ఆలోచనే చెల్లీ''

''వాడికా వయసు వచ్చేటప్పటికి బ్యాంక్ ఎంత వడ్డీ ఇచ్చినా కొనలేనంత ఖరీదుకి పెరిగిపోతుంది ఇంజనీరింగ్ సీటు. అది తెల్సుకో''

''నేను కాదు నీవు తెల్సుకోవాల్సింది చాలా వుంది. ఇంజనీరింగ్ అని గెంతుతున్నావు గాని మనకిప్పుడు కిళ్లీబడ్డీల కన్నా ఇంజనీరింగ్ కాలేజీలే ఎక్కువున్నాయి. అమ్మా చెల్లెమ్మా! చాలా కాలేజీల్లో చాలా సీట్లు మిగిలిపోయాయి. ఏం చేయాలో తోచక ఈగలు తోలుకుంటున్నారు. ఎమ్‌సెట్ పరీక్షలు వచ్చే ఏడాది నుంచి ఎత్తేస్తే ఎలా వుంటుందని ఆలోచిస్తోంది గవర్నమెంటు. అదమ్మా సంగతి'' అంది విజయ.

''నా కొడుకు కిళ్లీ బడ్డీల ఇంజనీరింగ్ చదువులు చదవడు. ఐఐటిలో మాత్రమే చదువుతాడు. ఎమ్మెస్ చేయడానికి అమెరికా వెళ్తాడు'' అంది గర్వంగా నీరజ.

''సంతోషం. అయితే నీ కొడుకు అమెరికా చదువులు చదవడానికి పునాదిగా ఈ పాతికవేలు కావాలి.''

''కర్రెక్టుగా చెప్పావ్ అక్కా. అయితే నేను పాతికవేలు అడుగుతున్నది ఎప్పుడో ఇంజనీరింగ్ చదువుల కోసం కాదు. రేపు జె.కె. కాన్వెంట్‌కి కట్టడానికి.''

తెల్లబోయింది సుందరమ్మ.

''చంటోడు పలక పట్టుకోడానికి పాతికవేలా!''

''మరేవిటనుకున్నావ్? జె.కె.కాన్వెంట్‌లో సీటు దొరకడం కష్టం. అనిరుథ్ పుట్టగానే అడ్వాన్సుగా అయిదువేలు కట్టి ఈ ఏడాదికి సీటు రిజర్వు చేసేసాం. జాయిన్ చేసేటప్పుడు బేలన్స్ పదిహేను వేలు కడితే చాలన్నాడు. ఈ రోజు మాట మార్చి పాతిక కట్టండి- బిల్డింగ్ ఫండ్ అంటున్నాడు. ఏం చేయడం తప్పదు.''

''బిల్డింగ్ ఫండ్ అంటే కట్టేయడమేనా? కట్టడం మానేసి అందరూ నిలదీసి అడగండి'' అంది సుందరమ్మ.

''నిలదీసి అడగడమా? ఎదుర్కోవడమా? అంత సీనే వుంటే మన దేశమెందుకిలా వుంటుంది. మన బతుకులెందుకిలా కాలిపోతాయి. అంతెందుకు? బిల్డింగ్‌ఫండ్ ఎందుకు పెంచావ్ అని మనం నిలదీసి అడిగేలోపుల అటునుంచి మరొకడు ఇదే సమయం అనుకొని సందులో దూరి కట్టేస్తాడు. మన సీటు కొట్టేస్తాడు. ఇక మనం చేయాల్సిన పని ఏమిటంటే మళ్లీ తిరుపతి వచ్చి గోవిందా అని భజన చేయడమే. చెక్క భజన.''

''అంతేసి డొనేషన్లు కట్టి చదివే చదువులేమిటో నాకు అర్థం కావడం లేదు. అయినా ఎంత చెట్టుకి అంతగాలి అన్నారు. ఏ వ్యవహారంలోకైనా దిగే ముందు నీ స్థాయి ఏమిటో ఒకటికి రెండు సార్లు ఆలోచించుకు దిగాలి'' అంది సుందరమ్మ.

''అర్థం లేకుండా మాట్లాడకమ్మా! ఏ పనికైనా దిగితే గాని లోతు తెలియదు. లోతుగా వుంటుందేమోనని భయపడి దిగడమే మానేస్తామా? తెగించి దిగాలి. అయినా ఏమిటమ్మా నీ ఉద్దేశం! నా కొడుకుని జె.కె.కాన్వెంట్‌లో చదివించలేనంత కిందస్థాయిలో మేం లేము. అవసరమై ఇవ్వడానికి నీవు వున్నావు. పైన భగవంతుడున్నాడు. చూసేవా దేవుడు సమయానికి నన్నెలా ఆదుకున్నాడో'' అని పాతికవేల మూటపై చేయివేసి కళ్లకి అద్దుకుంది నీరజ.

''చెల్లీ! పిల్లల్ని నీవే కాదు. నేనూ కన్నాను. నా కూతురు కూడా కాన్వెంట్ చదువులు చదువుతోంది. అయితే మేం పది రూపాయలు కూడా డొనేషన్ కట్టలేదు. నెలనెలా ఫీజులు కళ్లు తిరిగిపోయేటంతంగా కడుతున్నది చాలదా! నీవు వేలకి వేలు డొనేషన్లు కట్టడం అనవసరం. మా బోనీ చదివే కాన్వెంట్‌లో అనిరుథ్‌ని జాయిన్ చేయి. డొనేషన్ లేకుండా నేను సీటు ఇప్పిస్తా.''

''అక్కా! నీ కూతుర్ని ఆ చెత్త కాన్వెంట్‌లో ఎందుకు చదివిస్తున్నావ్ అని ఏనాడైనా నిన్ను అడిగానా? అంచేత నీవు కూడా నా కొడుకు చదవబోయే కాన్వెంట్ విషయంలో కలుగచేసుకోకు ప్లీజ్!''

''అది కాదే నీ మొగుడు ఇంజనీర్ గోల్డ్ మెడలిస్ట్ అవునా! ఏ కాన్వెంట్‌లో చదివేడు'' అడిగింది సుందరమ్మ.

''దుంపల బడిలో చదివేడు'' అని అందించింది విజయ.

''దుంపలబడిలో చదివిన వాళ్లంతా ఇంజనీర్లు, గోల్డ్‌మెడలిస్ట్‌లూ అవుతారని గ్యారంటీ లేదు. నేనా రిస్క్ తీసుకోను. నా అనురుథ్ జెకె కాన్వెంట్‌లో చదువుతున్నాడంతే. మీరెవరూ ఆపలేరు.''

''మేం ఎందుకు ఆపుతాం! నీ కొడుక్కి డొనేషన్ పాతికవేలు కాకుంటే యాభైవేలు కట్టుకో... మాకెందుకూ. కాని ఈ పాతికవేలతో మాత్రం కాదు'' అని స్పష్టం చేసింది విజయ.

''కాదనడానికి నీవెవరు? ఏడుకొండలవాడు, ఆపద మొక్కులవాడు నన్ను అనుగ్రహించేడు. నా మొర ఆలకించి ఈ సొమ్ము ప్రసాదించేడు. స్వయాన అనిరుద్ చేతిలో పెట్టాడు. వాడి చదువుకోసం. ఇక ఇందులో వాదన అనవసరం'' అని తేల్చేసింది నీరజ.

''దుంపలబడిలో చదివిన వాళ్లంతా ఇంజనీర్లు, గోల్డ్‌మెడలిస్ట్‌లూ అవుతారని గ్యారంటీ లేదు. నేనా రిస్క్ తీసుకోను. నా అనురుథ్ జెకె కాన్వెంట్‌లో చదువుతున్నాడంతే. మీరెవరూ ఆపలేరు.''

''నా రక్తం ఉడికించకు. నేను మనిషిని కాను''

''తెలుస్తూనే ఉంది. మనిషివయితే ఇలా ప్రవర్తించవు. రాక్షసివి.''

''నేను రాక్షసినైతే నీవు కొరివి దయ్యానివి. దుమ్మల గొండివి.''

''అక్కా! నన్ను రెచ్చగొట్టకు. ఈ పాతికవేలు నావి. ముట్టుకోకు.''

''అదేం కుదరదంటే కుదరదు. ఆ మొత్తం డబ్బంతా నాది.''

ఆ డబ్బు నాదంటే నాదని అక్కా చెల్లెళ్లు ఇద్దరూ నోటికొచ్చినట్టు తిట్టుకోవడమే కాదు. అక్కడ తల్లి సుందరమ్మ లేకుంటే, అడ్డుకోకుంటే... ఇద్దరూ ఒకరి జుట్టు ఒకరు పీకేసికొని, జాకెట్లను చించేసుకొని, చీరల్ని లాగేసుకొని, గోళ్లతో ఒళ్లు బరికేసుకొని ఒక యుద్ధ సీన్ క్రియేట్ చేసేవారేమో!

''మీ ఇద్దరూ నోరు మూస్తారా'' అని సుందరమ్మ మహా గట్టిగా అరవడంతో విజయ, నీరజల నోర్లు మూతపడిపోయేయి. తర్వాత కూతుళ్లను మళ్లీ నోరు మెదపనీయకుండా జడాయించేసింది.

''ఇదంతా చూస్తుంటే మీకు సిగ్గు లజ్జా లేవని నాకు అర్థమయింది. డబ్బుపై మీ ఇద్దరి వ్యామోహం ఏదో సరదాగా తిలకిద్దామని, తెల్సుకుందామని మీ భాగోతం ఇంతసేపు భరించాను. డబ్బు కోసం అదీ పరాయి డబ్బుకోసం ఇలా పశువుల్లా మారి కుమ్ములాడేసుకునే స్థాయికి అంత నీచంగా దిగజారిపోతారనుకోలేదు. అశుద్ధం మీద పైసా కనిపిస్తే చాలు దానికోసం వెంపర్లాడే చెండాలపు కూతుళ్లను కన్నాను. ఛీ... కన్నందుకు సిగ్గుపడుతున్నాను'' అంది సుందరమ్మ.

తర్వాత అయిదు నిమిషాలు నిశ్శబ్దంగా గడిచేయి.

అక్కా చెల్లెళ్లిద్దరూ ... తల్లి చివాట్లు పెట్టిన తర్వాత చాలాసేపు మిన్నకుండిపోయారు. ఇద్దరూ ఒకరికొకరు 'సారీ' చెప్పుకున్నారు. తల్లిని క్షమించమన్నారు. కాసేపటికి ఇద్దరూ రాజీకి వచ్చేశారు. చేయి, చేయి కలుపుకున్నారు. చెమ్మ చెక్కలాడుకున్నంత హుషారుగా!

''అమ్మా! ఇక గోల చేయకు. అక్కా, నేను రాజీకొచ్చేశాం. పాతికవేలుని ఇద్దరం సమంగా పంచుకుంటాం'' అంది నీరజ.

''ఏమిటీ నేను గోల చేస్తున్నానా? ఆ మాట

అనడానికి నీకు నోరెలా వచ్చిందే. అయినా ఎవడబ్బ సొమ్మని మీ ఇద్దరూ వాటాలు వేసేసుకుంటారు?'' అంది సుందరమ్మ.

''ఇప్పుడర్థమయిందమ్మా! నీవెందుకు కేకలు వేస్తున్నావో. నీకూ వాటా కావాలి. అంతేనా?'' అంది విజయ.

''అక్కా! ఒకపని చేద్దామే. అమ్మకి అయిదు వేలు ఇచ్చి మనం చెరో పది తీసుకుందాం సరేనా!'' అంది త్యాగమయి నీరజ.

''చాలా చక్కని ఆలోచన! అమ్మా, నీ వాటా అయిదువేలు'' అని డిక్లేర్ చేసింది విజయ.

దాంతో సుందరమ్మ ఒడలు జలదరించింది. కళ్లు చెమర్చేయి. ఏదో పూనకం వచ్చినట్టుగా మాటాడసాగింది.

''అబ్బ! ఈ రోజు ఎంత సుదినం! నా కూతుళ్లు దయతలచి నాకు అయిదువేలు ఇస్తున్నారు. ఇది నిజమా! కల!.. నిజమే కదా! ఓహ్! ఆనందంతో నా ఒళ్లు పరవశించి పోతున్నదే. అయ్యో! ఇంత మంచి బుద్ధి మీకెలా వచ్చిందే. జడివానలా, జీడిబంకలా ఇద్దరు కూతుళ్లనుంచి ఒక్కసారిగా ప్రేమకారి పోతున్న ఈ శుభసందర్భంలో నాకెందుకో గతం గుర్తు చేసుకోవాలనిపిస్తోంది. అవును–

మీ ఇద్దరూ బుద్ధెరిగి నాకు ఏనాడైనా ఒక్క సారైనా 'అమ్మా! ఇందా' అని ఒక సత్తు రూపాయి కాసు ఇచ్చేరా? అమ్మా! నీ పుట్టినరోజు లేకుంటే పెళ్లిరోజు అని కనీసం చవకరకం ముతక చీర అయినా పెట్టేరా? లేదే! అలాంటిది నా కూతుళ్లు ఈ రోజు ఒక్కసారిగా అయిదువేలు ఇస్తుంటే మీ మాతృప్రేమకు నా గుండెల్లో గంటలు మోగు తున్నాయర్రా.

లక్షలు పోసి, పెళ్లిళ్లు చేసి మిమ్మల్ని అత్తవారిళ్లకి పంపినా... ఇప్పటికీ మీరు నన్ను వదలడం లేదు. అవసరమైన, కాకున్నా పండగలకీ, పబ్బాలకీ మీ సరదాలు తీరడానికి మీకూ, మీ పిల్లలకూ, మీ మొగుళ్లకూ... డబ్బు రూపంలోనో, బంగారు వస్తువులతోనో, మీకు తృప్తినిచ్చే ఖరీదైన బట్టల తోనో... ఎల్లప్పుడూ మిమ్మల్ని నేను సంతోష పరుస్తూనే ఉండాలి. అవును. మీ సంతోషమే నా తృప్తి. నా సంతోషం.

అయితే అమ్మని కూడా సంతోష పెడదామని మీకు ఇన్నాళ్లు తోచనిది ఈరోజు ఒక్కసారిగా స్ఫురించినందుకు నాకు ఎంత సంతోషంగా ఉందో చెప్పలేను. తొలుత మీ ఇద్దరూ నన్ను పక్కన పెట్టి డబ్బు కోసం కుక్కల్లా కాట్లాడుకున్నా... చివరికి నేను అబ్బురపడేలా నాకు అయిదువేలు పడేస్తు న్నారు. మహాప్రసాదం.

**లక్షలు పోసి, పెళ్లిళ్లు చేసి మిమ్మల్ని అత్తవారిళ్లకి పంపినా... ఇప్పటికీ మీరు నన్ను వదలడం లేదు. అవసరమైన, కాకున్నా పండగలకీ, పబ్బాలకీ మీ సరదాలు తీరడానికి మీకూ, మీ పిల్లలకూ, మీ మొగుళ్లకూ... డబ్బు రూపంలోనో, బంగారు వస్తువులతోనో, మీకు తృప్తినిచ్చే ఖరీదైన బట్టల తోనో... ఎల్లప్పుడూ మిమ్మల్ని నేను సంతోష పరుస్తూనే ఉండాలి.**

ఇన్నాళ్లూ నా దగ్గరనుంచి మీకు కావల్సింది డిమాండు చేసుకు తీసుకుపోతుంటే నేను అప్పుడూ ఆనందించేను. ఈ రోజూ ఆనందిస్తు న్నాను. అలా ఇలా కాదు. ఊపిరిసలపని ఆనందం తో ఉక్కిరి బిక్కిరి అవుతున్నాను.

అయ్యో! ఈ సొమ్ముని నన్నేం చేసుకోమంటారే తల్లీ! ఒక పనిచేయండి. రేపు తిరుపతి నుంచి ఇంటికి వెళ్లాక ఖరీదైన పట్టు చీరలు మీ ఇద్దరూ ఈ డబ్బుతో కొనుక్కోండి. మంచివి కొనుక్కోండి. డబ్బులేమైనా పడితే వేస్తాను లెండి. సరేనా?'' కళ్లు తుడుచుకుంది సుందరమ్మ.

విజయ, నీరజలు తెల్లబోయిన ఒకరి మొఖాలు ఒకరు చూసుకుంటూ వుండిపోయారు. చీరలు కొనుక్కోమనడం తప్ప మరేదీ వాళ్లకు రుచించలేదు అమ్మ గోడులో.

''అమ్మకేదో అయింది. కొత్తరకంగా మాటాడు తోంది'' అంది విజయ.

''చీరలు కొనుక్కోమన్నావు బాగుంది. కాని మరోవైపు తిడతావెందుకు?'' అంది నీరజ.

''తిట్టడం కాదే! మీ ఇద్దరినీ చెప్పుతీసి కొట్టాలి. నా ఒళ్లు అంత మండిపోతోంది. అత్త సొమ్ము అల్లుడు దానం చేసి నట్టు... ఎవరో దారినపోయిన దానయ్య పోగొట్టుకున్న డబ్బుని మీ ఇద్దరూ సొంతం చేసేసు కొని... తిడితే నాకు కూడా చిన్నవాటా పారెయ్యడానికి సిద్ధ మయ్యేరు. ఛీ! సిగ్గుల్లేవు మీకు. మీకేదో మాయరోగం పట్టుకుంది. డబ్బు జబ్బు.''

''మేం ఏం తప్పు చేశామని అంత గట్టిగా వాయించేస్తున్నావ్. ఏమైనా దొంగతనం చేశామా? ఎందుకంత కోపం? భగవంతుడు దయతో ఈ గదిలోకి చిన్న మూటని పంపేడు. అది దైవ ప్రసాదం. మేం కొంత తీసుకొని నీకు కొంత పెడుతున్నాం అంతకన్నా ఏం చేశాం?''

''అతి తెలివితేటలు ప్రదర్శించకండి. ప్రసాదం అంటే లడ్డూలు! డబ్బులు కాదు. దేవుడి దగ్గరికి ఎంతో కొంత డబ్బుతో మనం వెళ్లాలి తప్పా– దేవుడు మన భక్తిని మెచ్చి 'ఇదిగో భక్తా' అని మన చేతిలో డబ్బులు పోయడు.''

''ఇదిగో ఇచ్చాడు కదా! ఇంతకన్న నిదర్శన మేమిటి?''

''నోర్మూయండి. ఈ పాతికవేలు మీరు కష్టపడి సంపాదించింది కాదు. మీ తండ్రి సంపాదించింది కాదు. మీ మొగుళ్లు సంపాదించింది కాదు. ఎవరి కష్టార్జితాన్నో మీ తెలివితేటలతో దైవప్రసాదమనే పేరుపెట్టి కైంకర్యం చేయాలనుకుంటున్నారు. మీరు చేసుకోవల్సింది ఆత్మవంచనకాదు. ఆత్మ విమర్శ. అప్పుడు మాటాడండి నాతో'' అంది కోపంగా సుందరమ్మ.

విజయ, నీరజలు వెంటనే మాటాడలేక పోయేరు.

''తప్పు మాది కాదు. మాయదారి డబ్బుది. నీవు తిట్టేవరకూ మేం చేసింది తప్పుగా తోచలేదు. మమ్మల్ని క్షమించేయమ్మా'' అంది విజయ.

''దైవ ప్రసాదమని మేం దేవుణ్ణి రింగ్‌లోకి లాగినందుకు దేవుడికి కూడా క్షమాపణలు'' అంది నీరజ.

''మిమ్మల్ని తల్లిగా నేను క్షమించేయగలను. కాని ఆ భగవంతుడు మిమ్మల్ని క్షమించడు గాక క్షమించడు.

''అక్కా! అమ్మ నోటంట సినిమా డైలాగులు దొర్లిపోతున్నాయి''

''దొర్లవా మరి! రోజూ చూసే టీవీ సీరియల్స్, సినిమాల ప్రభావం.''

''అలా వెధవ కటింగులు, చెత్త జోకులూ వాగే బదులు... మనది కాని ఆ సొమ్ముని పోగొట్టుకున్న వ్యక్తికి చేర్చేదెట్లాగో కాస్త ఆలోచించడం బుద్ధివున్న వాళ్లు చేసే పని'' అంది సుందరమ్మ.

''అది పోలీసులు చేయాల్సిన పని'' అంది ముద్దుగా నీరజ.

''కరెక్ట్‌గా చెప్పావు చెల్లీ! పదండి పోదాం పోలీస్ స్టేషన్‌కి. దొరికిన డబ్బుని వాళ్ల చేతిలో పెట్టేసి మన చేతులు దులిపేసుకుందాం'' అంది విజయ.

''సర్లే! ఇంతసేపూ ఆ మూటపై మీ ప్రలోభం చూసేక... నా కెందుకో ఈ ప్రపంచం మొత్తం మీద నమ్మకం సడలిపోతోంది. నాకైతే ఏం చేయాలో పాలుపోవడం లేదు'' అంది సుందరమ్మ.

''అమ్మా! పదే పదే మమ్మల్ని దోషుల్ని చేసి బోనులో నిలబెట్టొద్దు. దండం పెడతాను. బుద్ధి తక్కువై ఏదో ప్రలోభ పడ్డాం. వెంటనే నీవు ఇచ్చిన షాక్‌కి మా తిమురు వదిలింది. తప్పు తెలిసొచ్చింది కదా! ఇక ఆపేయ్. మళ్లీ మమ్మల్ని తిట్టకు. మొదట్లో మనం ఆ డబ్బు పోగొట్టుకున్న వ్యక్తికోసం గాలించాం కదా. దొరకలేదు. ఆ తర్వాతే కదా మా బుద్ధి అడ్డంగా పరిగెత్తింది'' స్వతహాగా మేం బుద్ధిమంతులం అని చెప్పే యత్నంలో విజయ.

''అమ్మా! ఎందుకొచ్చిన గొడవ. పదండి పోలీస్‌స్టేషన్‌కి. జరిగిన విషయం చెప్పి ఆ మూటేదో అక్కడే పడేసి... చేతులు దులుపుకు వచ్చేద్దాం. ఆ డబ్బుని పోలీసులు పోగొట్టుకున్న వ్యక్తికి అందజేస్తారా లేదా అనే ఆలోచన నీవు చేయొద్దు. వాళ్లు ఏం చేస్తారో మనకి అనవసరం'' అంది నీరజ.

''పోలీస్ స్టేషన్‌కి మనం వెళ్లడం కాదు. డబ్బు పోగొట్టుకున్నవ్యక్తి ఈ పాటికే స్టేషన్‌కి వెళ్లి రిపోర్టు ఇచ్చి వుంటాడని నా అనుమానం'' అంది విజయ.

''అమ్మో! నీ వన్నది నాకెందుకో కరెక్టే అనిపి స్తోందే. సందేహం లేదు. అతడు రిపోర్టు ఇచ్చే వుంటాడు'' విజయ అనుమానాన్ని బలపర్చింది నీరజ.

అంతే! వాతావరణం మారిపోయింది. విజయ నీరజల గుండెల్లో రైళ్లు, చిందే చెమటలు, మనసులో మనక మసక మబ్బులు.

పోలీసులు ఏ క్షణంలోనైనా తలుపులు కొట్టి,

గదిలో ప్రవేశించి తల్లితో సహా తమ ఇద్దరినీ క్రూరంగా స్టేషన్‌కి ఈడ్చుకుపోయి కటకటాల వెనక్కి నిర్దాక్షిణ్యంగా తోసేస్తే!

అటు పార్కులో ఆడుకుంటున్న తమ పిల్లల గతేం కాను! పిల్లల గురించి ఎంత గట్టిగా ఏడ్చి గోలపెట్టినా... తమ ఏడుపుల్ని పోలీసులు పట్టించుకుంటారా?

ఆ సమయంలో వాళ్ళకి పతిదేవుళ్లు లేని లోటు గుర్తుకొచ్చింది. ఇక దేవుడిమీదే భారం వేసి దండాలు పెట్టుకున్నారు.

సుందరమ్మ మటుకు ఏ మాత్రం అధైర్యపడి పోలేదు. నిబ్బరంగా, నిదానంగా మంచం మీంచి లేచింది. తను గదినుంచి బయటకు వెళ్తూ- ''ఎక్కడికి వెళ్తున్నానని అడక్కండి. వచ్చి అన్ని విషయాలు చెబుతాను. ఒక గంటలో వచ్చేస్తాను. మరేం భయపడకండి. తలుపులు వేసుకోండి'' అంది.

వెళ్లిన సుందరమ్మ గంటలోపలే తిరిగి వచ్చేసింది.

తను ఎక్కడికో కాదు. పోలీస్ స్టేషన్‌కి వెళ్లి వచ్చింది. స్టేషన్‌లో ఆమెకి డబ్బు పోగొట్టుకున్న ఆసామి జాడ, ఆచూకి, ఆనవాళ్లు లభ్యంకాలేదు. తను నెమ్మదిగా ధైర్యంగా ఎంక్వయిరీ చేస్తే తెలిసిన విషయం ఏమిటంటే... గత రెండు రోజులుగా నగదుగాని, నగలు గాని ఇతరత్రా ఇంకేమైనా వస్తువులు గాని పోయినట్టు స్టేషన్‌లో రికార్డు కాలేదట-

ఆ విషయాలు సుందరమ్మ చెప్పాక విజయ, నీరజల్లో అలుముకున్న భయం కొంత పలచబడింది. కాస్త గుండె దిటవు అయింది.

''మిస్టరీగా ఉంది! ఏకంగా పాతికవేలు పోగొట్టుకున్నవాడు పోలీసుల్ని ఆశ్రయించక పోవడం ఏమిటీ?'' అంది విజయ.

''నేననుకోవడం ఏమిటంటే... ఈ పసుపు చుట్టలోనున్న పాతికవేలు ఏడుకొండలవాడికి సమర్పించుకోవడానికి తెచ్చిన మొక్కుబడి. మొక్కు తీర్చుకోవడానికి వచ్చి దైవసన్నిధిలోనే పాపం ఏ పరిస్థితిల్లోనో ఆ మూటను పోగొట్టుకొని ఉంటాడు. పోగొట్టుకున్నందుకు ఆ భక్తుడు కాస్త ఆందోళన, మనస్తాపం చెందినా... కాసేపటికి తెప్పరిల్లి, తేరుకొని అది దైవ సంకల్పంగా సమాధానపడివుంటాడు. దేవుడి కోసం తెచ్చిన ముడుపు కాస్త అడ్వాన్సుగా ఆ దేవుడే తననుంచి లాఘవంగా స్వీకరించినట్టు భక్తితో భావించివుంటాడు. తర్వాత లెంపలు వేసుకొని, దైవదర్శనం తృప్తిగా చేసుకొని ఇంటికి వెళ్లిపోయివుంటాడు.''

''అవునమ్మా, ఆ భక్తుడి విశ్వాసాలు నీవు చెప్పిన విధంగా ఉన్నప్పుడు దేవుణ్ణే ఆశ్రయిస్తాడు తప్పా పోలీసుని కాదు. నీ రీజనింగ్ బాగుంది'' అంది నీరజ.

''ఊహాగానాల్లో విహరించడం మానేసి... అన్నిటికన్నా ముందు మన ఎదురుగా వున్న ఈ పసుపు మూటను ఏం చేయాలో ఆలోచించండి. దీన్ని చూస్తుంటే నాకెందుకో విపరీతంగా భయమేస్తోంది. ఈ మూటను కిటికీలోంచి బయటకు విసిరేద్దాం. లేదా ఇక్కడే వదిలేసి మనం బయటకు పారిపోదాం. ఏదో వేగంగా తేల్చండి'' అంది విజయ అసహనంగా.

''అయ్యో! అంత భయమెందుకే! మనం ఏ తప్పూ చేయనప్పుడు దేనికి భయపడాలి. మనది కాని మనీ మనకు వద్దే వద్దు. ఈ మూటను వదిలించుకోవడం కాదు. చేర్చవలసిన చోటుకి చేరుద్దాం.''

''అంటే!''

''చెబుతాను. ఇప్పుడు మనం మరోసారి దైవదర్శనం చేసుకోబోతున్నాం. అదృష్టం కొలదీ ఈ రోజు భక్తుల తాకిడి తక్కువగా వుంది గాబట్టి దర్శనం తొందరగానే అవుతుంది.''

''ఈ మూట సంగతి చెప్పు''

''ఈ మూట కూడా మనతో బాటు వస్తుంది''

''అమ్మ తల్లోయ్! దీన్ని మేం ముట్టుకోం''

సుందరమ్మ నవ్వుతూ అంది- '' ఈ మూటను మనమెవ్వరం ముట్టుకోం. పట్టుకోం. పిల్లలు దైవస్వరూపులు. ఈ మూటను ఇక్కడికి తీసుకువచ్చింది వాళ్లే కదా. వాళ్లే ఈ మూటను నెత్తిన ఎత్తుకుంటారు. మనతో బాటు గుడికి తీసుకువస్తారు. దైవదర్శనం అయ్యేక వాళ్లే ఆ పసుపు మూటని దేవుడి హుండీలో పడేస్తారు. అదీ సంగతి. అర్థమయిందా!''

''హమ్మయ్య'' అని తేలికైన గుండెతో తల్లిని హత్తుకున్నారు విజయ, నీరజలు.

'దైవస్వరూపులు పిల్లలే కాదు... తమ తల్లికూడా' అనుకున్నారు ఆ క్షణం.

★

## నేను మొండిదాన్ని

ఈ జీవితమంటే నాకెంతో ఇష్టం. దేవుడిచ్చిన బహుమతి ఇది. ఈ చిన్న జీవితంలో ఎన్నో కోరికలుంటాయి. అన్నీ తీరవు. కాని కోరుకుంటూ వుంటాం. దేవుడంటే నాకెంతో నమ్మకం, విశ్వాసం. నేనేదైనా పనిని మొదలుపెడితే ఆపను. మొండిదాన్ని. నాకు ఆవేశమెక్కువ. తొందరగా కోపమొస్తుంది. ఈ కోపాన్ని వదుల్చుకోవడానికి ఎంత ప్రయత్నించినా వీలుకావడం లేదు. మగవాడిలో నాకు నచ్చేది సంస్కారం, తెలివితేటలు మాత్రమే కాదు, అతని సెన్స్ ఆఫ్ హ్యూమర్, పిల్లలతో అతడు ప్రవర్తించే విధానం. ఇవి కూడా నచ్చుతాయి. టైటానిక్ సినిమా నాకు చాలా ఇష్టం - ఒకప్పటి అందాల సుందరి సుస్మితాసేన్ అభిప్రాయాలివి. చేతిలో బొత్తిగా సినిమాలు లేకపోయేసరికి ఇలా మాట్లాడుతోంది పాపం.

